# పరంజ్యోతి

-కారంపూడి వెంకటరామదాస్

బిళహరి బిజినెస్‌లో బిల్‌గేట్స్ అంతటివాడు కావాలనే లక్ష్యంతో అర్హతకి తగ్గ ఉద్యోగం వచ్చినా కాదని స్వయంఉపాధినే జీవనోపాధిగా ఎంచుకున్నాడు.

దిగితేగానీ లోతు తెలీదన్నట్టు వ్యాపారంలో పెట్టుబడి పెట్టీ అడుగుపెట్టాక గానీ వ్యాపారమంటే పుల్లమీదున్న ఐస్‌ని చీకినంత సులువుకాదని అర్థమైంది.

ఈ ఉపమానానికి కారణం బిళహరి మొదటిగా మొదలుపెట్టిన వ్యాపారం ఐస్‌క్రీమ్ వ్యాపారం.

కాశ్మీర్‌లో మంచుకొండలా పెరగాల్సిన అతడి బిజినెస్ ఎండలో పెట్టిన ఐసులా కరిగిపోయింది. కారణం కాంపిటీషన్! దాంతో వేరే వ్యాపారం మీదకి దృష్టి మళ్లింది.

"ఒరే! నీకీ వ్యాపారం పిచ్చేమిట్రా? ఏదైనా ఉద్యోగం చేసుకోకా?" అంది బిళహరి తల్లి ఒక్కగానొక్క కొడుకుతో.

"అమ్మా! నీకు ఏ అంబానీ అమ్మలానో, టాటా తల్లిగానో వార్తల్లోకెక్కాలనే కోరిక ఏ కోశానా లేదా? నీ కొడుకుని 'బిళహరి గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కి హోల్ అండ్ సోల్ అధినేతగా చూడాలని లేదా?"తన వ్యాపారకాంక్షని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్న తల్లితో ఆవేశంగా అన్నాడు బిళహరి.

'బోర్నవిటా రోజుల్లో బోయస్‌గానీ..బారుకెళ్ళే రోజుల్లోనా? మాటవినడానికి' అని ఓ నిట్టూర్పు విడిచింది బిళహరి తల్లి.

* * *

బిళహరి తన నెక్స్‌ట్ బిజినెస్ ఏంటా? అని తల పగలగొట్టుకుని మరీ ఆలోచిస్తున్నాడు. ఏదైనా వెరైటీ వ్యాపారం మొదలుపెట్టి వార్తల్లోకి ఎక్కాలన్నదే అతడి ఉద్దేశం.

ఒకవైపు అన్ని భాషల న్యూస్‌పేపర్లని చదివించేస్తున్నా, మరోవైపు అన్ని టీవీ ఛానెల్స్‌ని కళ్ళు వాచేలా వాచ్ చేస్తున్నా అతడికి ఏదీ నచ్చడం లేదు.

ఏ వ్యాపారం చూసినా పోటీ...పోటీ! పోటీ లేని సూటి వ్యాపారం కోసం అతడి అన్వేషణ కొనసాగుతూనే ఉంది.

ఇటు బిళహరి తల్లి కొడుక్కి ఈ బిజినెస్ ఫోబియా ఎక్కడినించి వచ్చిందోనని తనలో తానే తల్లడిల్లిపోయింది.

ఓ రోజు బిళహరి బైక్‌మీద పోతుంటే ఫుట్‌పాత్ మీద పొట్టకూటికోసం రకరకాల వ్యాపారులు ఏవేవో వ్యాపారాలు చేస్తూ కన్పించారు.

అక్కడే చిలకజోస్యం చెబుతూ ఓ కోయదొర కూడా కనిపించాడు.

బిళహరి దృష్టి అనుకోకుండా అతడిపై పడింది.

వెంటనే బుర్రలో వెయ్యి ఓల్టుల బల్బు వెలిగినట్టైంది.

మెదడుకి మేత పెట్టాడు. క్షణాల్లో బ్రహ్మాండమయిన బిజినెస్ ఐడియా రూపుదిద్దుకుంది. కాసేపటికి బుర్రలో వెలిగిన బల్బు వేడికి చురుక్కుమనట్టుంది కాబోలు తన ఊహల్ని కట్టిపెట్టి ఈ లోకంలోకి వచ్చాడు.

'యస్! ఐ గాట్ ఇట్!' ఆనందాన్ని అణచుకోలేక ఆ నడిరోడ్డు మీదే గట్టిగా అరిచాడు బిళహరి.

ఎర్రగడ్డ పేషెంట్ తప్పించుకుని తిరుగుతున్నాడన్న వార్త ఆరోజు అన్ని న్యూస్‌ఛానెల్స్‌లో ప్రముఖంగా ప్రసారం కావడం ఊరిజనం విని ఉండడం చేత బహుశా ఆ వ్యక్తి ఇతడేనేమో అన్న అనుమానం బిళహరి ప్రక్కనే ప్రయాణం చేస్తున్న వారికి వచ్చింది. 'ప్చ్!..' అని బిళహరిపై జాలిపడుతూ ముందుకి సాగిపోయారు.

* * *

బిళహరి తన క్యాబిన్‌లో కూర్చుని దారిలో కనబడ్డ చిలకజోస్యం గూర్చి సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

మెదడుకి మరింత పదును పెడుతూ బుర్రనే కంప్యూటర్‌గా మలిచాడు.

చిలకజోస్యం ఆ కంప్యూటర్ స్క్రీన్ మీద స్క్రీన్‌సేవర్‌లా అటు ఇటూ దూసుకుపోతున్నట్లుగా తోచింది.

ఆ చిలకజోస్యంకి కాస్త హైటెక్ హంగుల్ని అద్దాడు.

ఫలితంగా ఓ కార్పొరేట్ ఆఫీస్ రూపుదిద్దుకుంది.

అరడజను కంప్యూటర్ల ముందు అందాలభామలు కస్టమర్లతో చిరునవ్వులొలికిస్తూ ఆకట్టుకుంటున్నారు.

మరోవైపు షోకేసులో ధగధగమెరిసే రాళ్ళు. అక్కడికి వచ్చే వారంతా తమ జాతకాలని పరీక్షించుకుని వాళ్లిచ్చే 'రాళ్ళు'పుచ్చుకుని కొండంత ఆశతో వెళుతున్నారు.

సంప్రదాయ జ్యోతిష్యానికి సైంటిఫిక్ టచ్ ఇస్తూ జాతి 'రాళ్ల'తో కష్టమర్ల జాతకాల్ని మార్చే ఆ వినూత్న వ్యాపారానికి అప్పుడే నామకరణం కూడా జరిగిపోయింది.

అదే 'పరంజ్యోతి'. కింద చిన్న అక్షరాలతో 'మీ బ్రతుకుల్లో బ్రైట్‌నెస్' అన్న టాగ్‌లైన్. సృష్టికర్త పండిత బిళహరి బ్రహ్మానందశాస్త్రి. ఇదంతా ఓ సినిమా ప్రివ్యూలా చూసిన బిళహరి పెదవులపై విజయ మందహాసం వెలిసింది. 'అవును! ఈ బిజినెస్‌కి తిరుగుండదు. ప్రజల వీక్‌నెస్సే ఈ వ్యాపారానికి పెట్టుబడి. పబ్లిసిటీయే పాశుపతాస్త్రం' అనుకున్నాడు బిళహరి.

* * *

కేవలం పాతికరోజుల్లో 'పరంజ్యోతి' వెలిసింది.

'పరంజ్యోతి'ప్రచారసందడి సందుగొందుల్లోనే గాక సంచార మాధ్యమాలన్నింటా హోరెత్తేసరికి

ప్రజలదృష్టి దానిపై పడింది.

బిళహరికి చేతినిండా పనిదొరికేసరికి చేతికింద చిదంబరం అనే అసిస్టెంట్ వెలిశాడు.

కష్టమర్ల జాతకాలు చూసి కష్టసుఖాలు చెప్ప డమే కాకుండా చేతికి ఉంగ'రాళ్ళు' సజెస్ట్ చేసి ఇక మీ జీవితాల్లో వెలుగులే వెలుగులని ఈస్ట్‌మన్ కల ర్‌లో అక్కడికక్కడే వారిచేత కలలు కనేటట్టు చేస్తు న్నారు స్టాఫ్.

ఒరోజు దంపతుల జంట ఒకటి వచ్చి బిళహ రిని కలుసుకుని-

"మాకు పెళ్లై ఐదేళ్లైనా పిల్లలు లేరు. ఇంతకీ ఆ యోగం ఉందా?" అంటూ ఆందోళన చెందారు.

ఈ ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు బిళహరి.

'పిల్లలకోసం ఏ డాక్టర్‌నో కలవక ఇక్కడికొచ్చా



రేంటి?' అని మనసులో అనుకున్నాడు.

వెంటనే సర్దుకుని ఇప్పుడు వీళ్ళు తన కష్టమర్స్ కనుక తన శైలిలో సమస్యని పరిష్కరించాలనుకున్నాడు.

ఆ దంపతులిద్దర్నీ బాగా అబ్జర్వ్ చేశాడు. అలాగే జాతకం కూడా చూశాడు.


ఆ వెంటనే వారితో-

"మీకు శనిదోషం వల్ల సంతానం కలగడం లేదు. ఈ రాయిని ఈమె ధరిస్తే తప్పక సంతానం కలుగుతుంది'' అని చిన్న స్టోన్ ఇచ్చాడు.

"ఈ రాయిని ఏ వేలికి ధరించాలి?'' అమాయకంగా అడిగిందామె.


"అక్కడే పొరబడ్డారు. దాన్ని వేలికి కాదు, ముక్కుకి అంటే ముక్కుపుడకగా చేయించుకుని ధరించండి''

ఇదేదో వింతగా తోచినా ఏ పుట్టలో ఏ పాముందోనని అలాగేనన్నారు ఆ దంపతులు.



## ప్రత్యేకత

కొన్నిచిత్రాలు కొన్ని ప్రత్యేకతల్ని సంతరించుకుంటూ ఉంటాయి. గోపీచంద్ తాజా చిత్రం ఒక్కడున్నాడు ఇప్పుడదే స్పెషాలిటీని పొందింది. బాలీవుడ్ దర్శకుడు మహేష్ మంజ్రేకర్ ఈ చిత్రంలో ప్రత్యేక పాత్రలో కన్పించనున్నాడు. ఇదిలా ఉంటే గోపీచంద్ సరసన నేహా జుల్కా నటిస్తోంది. స్పెయిన్‌లో జరిగే పాటల రికార్డింగ్ ఈ చిత్రం పాటల్ని శ్రోతలకి కలకాలం గుర్తుండేలా చేస్తాయంటున్నారు.




కడుపు పండడానికి పదివేలు కట్టుకుని అక్కడినుండి కదిలారు.

* * *

నెల్లాళ్ళు తిరిగిందో లేదో ఓ రోజు 'పరంజ్యోతి'కి వచ్చి ఆ దంపతులిద్దరూ ఆనందంతో హడావిడి చేస్తూ బిళహరిని ఏకంగా భగవంతుడ్నే చేసేశారు.

వారి ఆనందానికి అసలు కారణం త్వరలో వారికి బిడ్డ పుట్టబోవడమే. ఇది విన్న బిళహరి చిద్విలాసంగా నవ్వాడు.

చిదంబరానికైతే అంతా అయోమయంగా ఉంది. గురువిచ్చిన రాయిలో అంత మహత్యం ఉందంటే నమ్మలేకపోయాడు. ఏమైతేనేం వారు చేసిన హడావిడి అక్కడున్న కష్టమర్లలో చాలా నమ్మకాన్ని పెంచి ఉచిత పబ్లిసిటీ ఇచ్చింది. ఆ దంపతులిద్దరూ వెళ్ళాక చిదంబరం ఉండబట్టలేక బిళహరినిలా అడిగాడు.

"అంత ఖచ్చితమైన రాయినెలా ఇవ్వగలిగారు?''

"ఖచ్చితమా, కాకరకాయా! చిన్నకిటుకు పనిచేసింది''

"కిటుకా? ఏమిటి సార్?''

"ఆ దంపతుల్లో ఆమెని పరీక్షగా చూశాను. చిన్నముక్కుపుడకతో కొత్త కళ వుట్టిపడే భార్యని చూసి ఆమె భర్తలో కోరికలు ఎక్కువ అవుతాయని ఊహించాను. అదే జరిగింది!''

"ఆఁ!'' అని నోరు తెరిచి ఉండిపోయాడు చిదంబరం.

* * *

'పరంజ్యోతి' కొచ్చే కష్టమర్స్ వింతగా ఉంటారు.

ఓ సారి బడా సినీనిర్మాత బిళహరిని కలుసుకుని-

"అయ్యా! నేను మంచికథలతో సినిమాలు తీశాను. అయినా అవి బాగా ఆడలేదు. జాతకం చూసి నేనో సూపర్ డూపర్ హిట్‌ని ఇవ్వగలనో లేదో? చెప్పండి'' అన్నాడు.

ఆ నిర్మాత బాధనర్థం చేసుకున్న బిళహరి అతడి చేతిని పరీక్షించీ, కంప్యూటర్లో ఏవో లెక్కలు కట్టి-

"కొడతావయ్యా! తప్పకుండా హిట్టుకొట్టబోతున్నట్లు నీ జాతకంలో ఉంది. పోతే ఈ పుష్యరాగం ధరించాలి. అలాగే నీ కథారచయితని కథ తీసుకుని ఇక్కడికి రమ్మను, ఆ కథకి చిన్న పూజచెయ్యాలి. అప్పుడే నీ సినిమా హిట్టవుతుంది'' అంటూ ఓ రాయిని ఇచ్చాడు బిళహరి.

ప్రతి సంవత్సరం ఆ తిరుపతి వెంకన్న యెదుట భక్తితో నిలువుదోపిడీ ఇచ్చుకునే ఆ నిర్మాత, ఆరోజు బిళహరి చేతిలో బలవంతాన్న నిలువుదోపిడీకి గురయ్యాడు.

* * *

ఆర్నెల్లు తిరిగిందో లేదో సదరు నిర్మాత ఓ రోజు 'పరంజ్యోతి'కొచ్చి తన సినిమా 'ఆల్‌టైం హిట్టైంది'' అని హంగామా చేశాడు.

అక్కడితో ఆగాడా? లేదే?

హీరో దర్శకులతో పాటూ ఏకంగా బిళహరిని కూడా టీవీ ద్వారా వార్తల్లోకి ఎక్కించేశాడు.

'ఏం సినిమా గురూ!, సీను కావాలా? సాంగు కావాలా?..'లాంటి లైవ్ ప్రోగ్రామ్స్‌లో బిళహరికి బహుళ ప్రచారం లభించింది. అదీ ఉచితంగా!

చిదంబరంకి మళ్ళీ చిన్న అనుమానం.

"సార్! మనరాళ్లలో నిజంగా అంత మహిమ ఉందంటారా?'' సందేహిస్తూనే సందేహాన్ని వెలిబుచ్చాడు.

"పాగల్‌ఖానా నుండి పారిపోయొచ్చినోడ్లా ఏంటా పిచ్చి ప్రశ్న? ఆ కథార

చయిత తెచ్చిన కథని వాడి మొహం మీద చించీ చెత్తబుట్టలో వేశా. యువత రాన్ని మత్తెక్కించే ప్రేమ (?)ని బేస్ చేసుకుని షేకయ్యే పాటల్తో పెద్దల్నెది రించే ప్లాటునే తీసుకోండి మీకు అచ్చొస్తుందన్నాను. వాళ్ళు అక్షరాలా అదే తీశారు. హిట్టు కొట్టేశారు''

బాస్ చెప్పిన బహిరంగ రహస్యానికి చిదంబరం కళ్ళు తేలేసి కిందపడితే మినరల్ వాటర్ మొహాన్న కొట్టి మరీ లేవనెత్తారు మిగతా స్టాఫ్.

★ ★ ★

"సార్! మిమ్మల్ని కలవడానికో కస్టమర్ వచ్చాడు'' అన్నాడు బాస్‌తో చిదంబరం.

"లోపలికి పంపు'' అని సమాధానం ఇచ్చి బిజినెస్ డెవలప్‌మెంట్ గురించి ఆలోచిస్తున్నాడు బిళహరి.

"నమస్కారం సార్!'' అన్నాడా కస్టమర్.

"నమస్తే!...చెప్పండి...వాట్‌కెనైడూ ఫర్ యూ?''

"నా జాతకం చూసి నా భవిష్యత్తు ఎలా ఉంటుందో చెప్పండి సార్. కాక పోతే మీరు చెప్పేది నాకు నమ్మకం కలగాలంటే ముందు నా ప్రశ్నలకి సమా దానం మీరు చెప్పాలి!'' అన్నాడా కస్టమర్.

'ఇతడు నిజంగా జాతకం చూపించుకునేందుకు వచ్చాడా లేక తనని పరీ క్షించడానికి వచ్చాడా?' అని మనసులో గుబులు చెందాడు బిళహరి.

ఇన్నాల్టికి సరైన కస్టమర్ తగిలాడని తెగ ఆనందపడ్డాడు చిదంబరం.

ఇంతలో బిళహరి సెల్‌ఫోన్ మ్రోగింది. సిగ్నల్స్ సరిగ్గా లేవని ఫోన్‌తో ఆఫీసు వరండాలోకి వచ్చి మాట్లాడాడు.

ఫోన్‌కాల్ పూర్తికాగానే తిరిగి లోపలికి నడిచాడు.

"సార్! నాకు పెళ్లైందా? లేదా? అయితే ఎంతమంది పిల్లలు? ఆడా? మగా? వీటికి సరిగ్గా సమాధానం చెబితే నేను మిమ్మల్ని మీ సంస్థని పూర్తిగా నమ్ముతాను!'' సవాల్ విసిరాడు కస్టమర్.

బిళహరి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. లేని ధైర్యం తెచ్చు కున్నాడు.

"మీ ప్రశ్నలకి జవాబిచ్చే ముందు నాదో ప్రశ్న! అసలు మీరు ఎలా వచ్చారు ఇక్కడికి?'' ఏ మహానుభావుడు చెప్పగా ఇక్కడికి తగలడ్డాడో తెలు సుకుందామని అడిగాడు.

"కారులో...''

వినవచ్చిన సమాధానం వేరైనా తనకు ఉపయోగపడేదేనని సంబరప డ్డాడు.

ఏదీ బయటున్న ఆ ఊదారంగు కారేనా?

అవుననే సమాధానం కోసం ఆతృతగా బిళహరి ఎదురుచూశాడు.

"అవును...ఇంతకీ నా ప్రశ్నలకి జవాబు?''

ఇప్పుడు పూర్తిగా ధైర్యం వచ్చింది బిళహరికి.

"మీకు పెళ్లైంది. ఇద్దరు పిల్లలు. ఇద్దరూ కొడుకులే!'' సూటిగా జవాబి చ్చాడు బిళహరి.

"పేర్లు..అఖిల్, అనిల్'' మళ్ళీ అన్నాడు బిళహరి.

ఇది విని ఆ కస్టమర్ ఆశ్చర్యపోయి బిళహరిని ఆకాశానికి ఎత్తేస్తూ వచ్చిన పని ముగించుకుని సంతోషంగా బయటపడ్డాడు.

చిదంబరానికైతే నోటమాటరాలేదు.

కస్టమర్ని బయటవరకూ సాగనంపి తిరిగొచ్చిన చిదంబరం,

"సార్.. ఇంత ఖచ్చితంగా పేర్లతో సహా ఎలా చెప్పగలిగారు?''ఎప్పట్లాగే బాస్‌బుర్రని మెచ్చుకుంటూ అడిగాడు.

"నేను ఫోన్‌లో మాట్లాడుతూ బయటకెళ్లానా అక్కడ పార్క్ చేసున్న ఊదారంగు కారుని గమనించాను కారు బ్యాక్‌గ్లాస్ మీద 'అఖిల్, అనిల్' అని పేర్లు రాసి ఉండడం. సాధారణంగా పిల్లల పేర్లు తమ వాహనాల మీద రాసు కోవడం అదో ఫ్యాషన్ కదా! అదే నాకు ఉపయోగపడింది''

"వావ్...అద్భుతం సార్...మీ తెలివితేటలు అమోఘం. ఇన్ని తెలిసిన మీకు ఆ కస్టమర్ నిజానికి ఇక్కడికి ఎందుకొచ్చాడో తెలుసా?'' కూల్‌గా అడిగాడు చిదంబరం.

"ఎందుకేంటి? బిజినెస్‌లో ఏవో ఒడిదుడుకులు..''

"అది సరే! కానీ అతడు చేస్తున్న బిజినెస్ అమ్మేసి మనకెదురుగా 'దివ్య జ్యోతి' అనే ఆస్ట్రాలజీ కమ్ లక్కీస్టోన్ ఆఫీసు పెట్టబోతున్నాడు. కొత్త ఆఫీసు పెట్టే ముందు అబ్జర్వేషన్ కోసం మన దగ్గరకొచ్చాడు. ఈ విషయం వెళ్తూ నాకు సెలవిచ్చాడు'' చావుకబురు చల్లగా చెప్పాడు చిదంబరం.

'దబ్'మని చప్పుడైతే ఏంటా? అని నేలకేసి చూసిన చిదంబరం నేలకరి చిన బిళహరిని చూసి జాలిపడ్డాడు.

★

## ఆకుపచ్చని ఆరోగ్యం

ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. పచ్చిమిర్చి, పాలకూరలాంటి వాటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. అవి మన శరీరంలోని కణజాలం త్వరగా పాడవకుండా కాపాడడం వాటి సహజ లక్షణం. మంచి విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఆహారం బాగా జీర్ణం కావడానికి అవసరమైన మంచి పీచు పదార్థం వీటిలో అధికంగా ఉంటుంది. సహజంగా వీటిలో కొవ్వు, సోడియం, కెలోరీలు తక్కువ. కొలెస్ట్రాల్ శూన్యం, ఫైటో కెమికల్స్ ఉంటాయి. వాటిలో గుండె జబ్బులు, క్యాన్సర్లు, షుగర్...లాంటి వ్యాధులు రాకుండా చూసే సంయోగ పదార్థాలుంటాయి. వేర్వేరు రకాల పచ్చని కూరలు వేర్వేరు విటమిన్లు కలిగి వుంటాయి. పాలకూరలో ఇనుము, విటమిన్-ఎ అధికం.

## దానిమ్మతో లాభాలెన్నో...

దానిమ్మపండు సౌందర్య పరిరక్షణలో దివ్యమైన ఔషధంగా పని చేస్తుంది. ప్రతిరోజూ దానిమ్మ పండును తీసుకుంటే చర్మంపై ముడతలు మాయమైపోతాయి. యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే దానిమ్మలో పోలిఫెనాల్స్, విటమిన్-సి, ఫోలిక్ ఆసిడ్‌లు కూడా ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. బరువు తగ్గడానికి కూడా దానిమ్మ దోహదపడుతుంది.

-కె.మంజువాణి

